
సాక్షి ఒడిశా

బుధవారం । 29 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,36,261
బంగారం	7 గ్రాముల 200 మిల్లీ గ్రాములు
వెండి	52 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యం

బీజేడీ పార్టీకి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు.

- 8లో



ప్రతీ జిల్లాలో పరిశ్రమల స్థాపనే లక్ష్యం

రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో పరిశ్రమల స్థాపనే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

అడవుల సంరక్షణకు బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న అటవీ సిబ్బంది

రాయగడ: పర్యావరణ పరిరక్షణతో పాటు అడవుల ఆవశ్యకత తెలియజేసేందుకు జిల్లాలోని మునిగుడలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కొంతమంది అవగాహన రాహిత్యంతో అడవులకు నిప్పుపెడితే పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామాల్లోని ప్రజలకు చైతన్యం కలిగించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నామని మునిగుడ రేంజర్ అనిల్ కుమార్ బాల, పర్యావరణ ప్రేమికుడు గౌరంగ చరణ్ రౌత్ తెలియజేశారు. రేంజ్ పరిధిలోని బైరగుడ, కుముడాబల్లి, మేరింగి, తులసీపాదొరా, కొరామోహన, డెప్పాగుడి, తారాబడి, తెలెంగపాదొరా తదితర గ్రామాల్లో ఈ ర్యాలీ కొనసాగింది.

రాగుల మండీ పరిశీలన



మండీలో రాగుల నాణ్యత పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తివాసన్

జయపురం: సబ్ డివిజన్ కుంద్రలో ఏర్పాటు చేసిన రాగుల మండీని కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తివాసన్ సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా మండీలో కొనుగోలు చేసిన రాగుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం మండీల్లో సౌకర్యాలు, సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. అలాగే మండీకి రాగులు తీసుకొచ్చిన మహిళా రైతులతో మాట్లాడి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. రాగులు నిల్వ చేసేందుకు గిడ్డంగి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు సబ్ కలెక్టర్ ఎ.శౌర్య రెడ్డి తదితరులు ఉన్నారు.

అటవీ భూపట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘ అధ్యక్షుడు బందు ముదిలి

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి కదంగూడ పంచాయతీలో అటవీ భూపట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా ఆదివాసీ మహాసంఘ అధ్యక్షుడు బందు ముదిలి, పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ్ జిగిడీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎఫ్ఆర్ఏ యాక్ట్ 2006 కింద ఆదివాసీల హక్కులపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా గదబా సమాజ్ అధ్యక్షుడు భీష్మ ఖీలో, జిల్లా బోండా సమాజ్ అధ్యక్షుడు ముకుంద మాఝి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు



పట్టుబడిన ద్విచక్ర వాహనాలతో నిందితులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ కుంద్రాలో ద్విచక్ర వాహనాల దొంగలు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయం ముగ్గురు యువకులు ఒక బైక్‌పై కుంద్రా నుంచి డొంగిరిపంసి వైపు వెళ్తున్నారు. ఆ సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వారిని ఆపి విచారించారు. దీంతో వారు బైక్‌ను దొంగిలించిన విషయం తెలిపారు. అనంతరం పోలీసులు తమదైన శైలిలో విచారించగా మరో 6 బైక్‌లను సైతం దొంగిలించి వాటిని బొయిపరిగుడ సమితిలోని కదమగుడ, బొడొగుడ గ్రామాల్లో ఉంచినట్లు పేర్కొన్నారు. దీంతో పోలీసులు కదమగుడ గ్రామంలో 5 బైకులు, బొడొగుడలో ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారని పోలీసు అధికారి చిత్తరంజన్ ప్రధాని తెలియజేశారు. అలాగే బైక్‌లు కొనుగోలు చేసిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.



పారిశ్రామికవేత్తలకు ప్రధానమంత్రి అభివాదం



సదస్సుకు హాజరైన వ్యాపార దిగ్గజాలు



పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం మోహన్‌చరణ్

పెట్టుబడులకు.. ఒడిశా అనుకూలం

- రాష్ట్రంలో పుష్కలంగా వనరులు
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడి
- ఉత్కర్ష్ ఒడిశా–2025, మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్ సదస్సు ప్రారంభం

భువనేశ్వర్: అభివృద్ధిలో ముందుకెళ్తున్న ఒడిశా రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఉత్కర్ష్ ఒడిశా–2025, మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్ సదస్సులను పీఎం నరేంద్రమోదీ మంగళవారం ప్రారంభించారు. ఈ సదస్సు రెండు రోజుల పాటు సాగనుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. వ్యాపార అనుకూల అవకాశాలు, కొత్త వ్యాపార విధానాల ఆవిష్కరణకు ఒడిశాలో పుష్కలంగా వనరులు ఉన్నాయన్నారు. వికసిత్ భారత్ సాకారం వాస్తవ కార్యాచరణలో ఈ సదస్సు తీర్మానాలు సంపూర్ణంగా ప్రతిబింబిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అధునాత వర్తక ఆవిష్కరణలకు ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ప్రాచీన కాలం నుంచి ఒడిశా వర్తక వ్యాపారాలకు అనుకూలమైన ప్రాంతంగా చరిత్ర పుటలు వర్ణిస్తున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ఓడరేవులు, ఏటా నిర్వహించే వ్యాపార వారసత్వ బాలి జాతర వంటి సంప్రదాయాలు ప్రాచీన వర్తక అనుకూలతకు నిలువెత్తు తార్కాణాలుగా పేర్కొన్నారు.



పీఎం మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

చరిత్ర పునరావృతం

21వ శతాబ్దంలో వాణిజ్యం మరియు వ్యాపార సాంస్కృతిక కేంద్రంగా ఒడిశా ఘన చరిత్ర పునరావృతం కానుందని పీఎం పేర్కొన్నారు. ఇటీవల సింగపూర్ అధ్యక్షుడి పర్యటనే దీనికి ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ఆయన పర్యటన పురస్కరించుకుని పలు వ్యాపార ఒప్పందాలు కుదిరాయని వెల్లడించారు. పరిశ్రమల నిర్వహణకు అవాంఛనీయ ఖర్చులను నివారించి పారిశ్రామిక విస్తరణకు భారీ పెట్టుబడులను ఆకట్టుకునే ఒడిశా కార్యశైలి పారిశ్రామిక దిగ్గజాలను ఆకట్టుకుంటోందన్నారు. ప్రధానంగా మౌలిక వనరులు, రవాణా అనుసంధానం రంగాల పటిష్టతపై రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో రైల్వేలు, జాతీయ రహదారులు మరియు ఓడ రేవులను అభివృద్ధి చేయడంలో వేల కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో పలు పరిశ్రమల ఏర్పాటు కార్యకలాపాలు చురుకుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ప్రముఖ వ్యాపార, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.



మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్ ప్రారంభిస్తున్న పీఎం నరేంద్ర మోదీతో గవర్నర్ హరిబాబు, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్

వ్యాపారాలకు విస్తృత అవకాశాలు

- సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో వ్యాపారాలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని సీఎం మోహన్ చరణ్ మాఝి అన్నారు. స్థానిక జనతా మైదాన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఉత్కర్ష్ ఒడిశా, మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్ – 2025 వేదికపై ఆయన ప్రసంగించారు. వికసిత్ ఒడిశా, వికసిత్ భారత్ దృక్పథానికి రాష్ట్రంలో అనుకూలమైన వనరులు, వ్యాపార కార్యకలాపాలకు అధునాతన సౌకర్యాలు పుష్కలమన్నారు. రాష్ట్రంలోని మొత్తం 30 జిల్లాల్లో సూక్ష్మ, మధ్య, లఘు వ్యాపారాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం కల్పిస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో జౌళి, ఆహార ఉత్పాదన, అల్యూమినియం వంటి పరిశ్రమల కోసం ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఇటీవల సింగపూర్ అధ్యక్షుడి పర్యటన పురస్కరించుకుని సింగపూర్ సంస్థలతో 8 వ్యాపార ఒప్పందాలు ఖరారు కావడం ప్రపంచ భాగస్వామ్యాలు మరియు ఆవిష్కరణలకు తమ నిబద్ధతను మరింత బలోపేతం చేసిందని వెల్లడించారు. పెట్రో కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్, ఐటీ, జౌళి మరియు మెటల్ పారిశ్రామిక రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఒడిశా ఆహ్వానిస్తుందన్నారు. 2036 నాటికి వికసిత్ ఒడిశా సంకల్ప సిద్ధికి అద్భుతమైన వృద్ధి ప్రయాణంలో తమతో చేరి సహకరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

యువత ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

పర్లాకిమిడి: యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్ అన్నారు. స్థానిక మహిళా డిగ్రీ కళాశాల 12వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు క్రమశిక్షణతో లక్ష్యం వైపునకు సాగాలని సూచించారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. విద్యార్థినుల ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవానికి గౌరవ అతిథిగా డీఆర్‌డీఏ అధికారి డా.గుణనిధి నాయక్ విచ్చేయగా, ప్రిన్సిపాల్ రీనాసాహు అధ్యక్షత వహించారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

సుందర్‌డంగ్ బ్లాక్ ఏర్పాటు చేయాలని వినతి



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న సర్పంచ్ ప్రేమ్ మఝి తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా, సువాగడ సమితిలకు చెందిన పది పంచాయతీల ప్రజలు తమకు కొత్తగా సుందర్‌డంగ్ బ్లాక్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ బిజయ కుమార్ దాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనివలన తమ పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పంచాయతీల ప్రజలు పింఛన్లు, ఉపాధి తదితర ప్రభుత్వ పథకాల కోసం ఆయా సమితి కేంద్రాలకు చేరుకోవాలంటే సుమారు 50 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమ్ మఝి, మాజీ జెడ్పీటీసీ సువాగడ జేమ్స్ రైకా తదితరులు పాల్గొన్నారు.

సమితి సమావేశం రసాభాస



సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఉల్క తదితరులు

జయపురం: బొయిపరిగుడ బ్లాక్ కార్యాలయంలో సమితి చైర్మన్ ప్రశాంత గుప్త అధ్యక్షతన సోమవారం జరిగిన సమితి సమావేశం రసాభాస అయ్యింది. తమను బీజేపీలో చేరమని అసిస్టెంట్ ఇంజినీర్ సృష్టి సుహాసిని ఒత్తిడి చేస్తున్నట్లు సభ్యులంతా మూకుమ్మడిగా ఆరోపించారు. అనంతరం వారంతా సభను బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. ఈ ఘటనపై కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క కాంగ్రెస్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అయితే బీడీవో అభిమన్య కవి శతపతి సభ్యులను బుజ్జగించడంతో తిరిగి సమావేశంలో పాల్గొన్నారు. సమితి సభ్యులంతా సమావేశం సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునారావృతం కాకుండా చూస్తామన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు తదితర అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చ, నవరంగపూర్ ఎంపీ ప్రతినిధి నరేంద్ర కందలియ, జిల్లా పరిషత్ సభ్యులు రమేష్ కుమార్ మహంతియ, మణీ జాని, పంచాయతీ సమితి ఉపాధ్యక్షురాలు పూర్ణిమ బారిక్, అదనపు బీఈవో నివేదిత దండసేన, జీపీఈవో కార్తీక చంద్ర పాడి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



రాయగడ: వేలాడుతున్న టున్ని మృతదేహం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి చంద్రగిరిలో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మృతురాలు టున్ని గొండాల్ (33)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..

మృతురాలి భర్త అజంత్ గొండాల్ చంద్రగిరిలో మెడికల్ షాప్ నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. అయితే ఇంటి తలుపును ఎంతసేపు కొట్టినా అతని భార్య తీయకపోవడంతో తలుపులు విరగొట్టి ఇంట్లోకి వెళ్లాడు. అప్పటికే ఆమె చీర సాయంతో ఉరివేసుకుని ఉంది. దీంతో పోలీసులకు సమాచారం అందజేశారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



మల్కన్‌గిరి: చెట్టుకు వేలాడుతున్న కైలాస్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఆరోగ్య కేంద్రానికి వెనుకవైపు మంగళవారం మధ్యాహ్నం చెట్టుకు వేలాడుతూ యువకుడి మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. కలిమెల సమితి తుంబగూడ గ్రామానికి చెందిన కైలాస్ మడ్కమి (22) అనే యువకుడు సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. దీంతో అతని తండ్రి పదియా మడ్కమి కలిమెల పోలీసులకు మంగళవారం ఉదయం ఫిర్యాదు చేశాడు. అయితే కలిమెల ఆరోగ్య కేంద్రానికి వెనుకవైపు అనుమానాస్పదంగా కైలాస్ మృతదేహం ఉరివేసుకొని ఉండడం గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఐఐసీ చంద్రకాంత్ తండి వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అయితే తమ కుమారుడిని ఎవరో హత్య చేశారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం వివరాలు వస్తే మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంది.

పక్కా ఇళ్లు వద్దు.. పాత ఇళ్లు చాలు



గ్రామస్తులతో చర్చిస్తున్న అధికారులు



ఇంటి నిర్మాణానికి వృద్ధురాలిని ఒప్పిస్తున్న అధికారులు



మహిళలతో అధికారులు చర్చిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి ముదిలిపాడలో బోండా గిరిజనులు నివసిస్తున్నారు. దీంతో జిల్లా అధికారులు ఆ పంచాయతీకి మంగళవారం వెళ్లారు. అక్కడ నివసిస్తున్న ప్రజలకు పక్కా ఇళ్లు నిర్మిస్తామని తెలియజేశారు. అయితే తమకు పక్కా ఇళ్లు అవసరం లేదని, తమ పాత ఇళ్లు ఉంటే చాలని పేర్కొన్నారు. దీంతో వారిలో చైతన్యం కలిగించడం కోసం అవగాహన చర్యలు చేపట్టారు. ఇటీవల మల్కన్‌గిరి జిల్లా పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం ప్రభాతి పారిడా మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గిరిజనులకు ఇళ్లు నిర్మించాలని ఆదేశించారు. దీంతో జిల్లా పరిపాలన విభాగం చీఫ్ డవలప్‌మెంట్ ఆఫీసర్ నరేష్ చంద్ర శబర ఇతర ఉన్నత అధికారులు ముదిలిపాడ, హంద్రాహల్ తదితర గ్రామాలకు చేరుకొని ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. దీనికి కొంతమంది గిరిజనులు అంగీకరించారు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు సహకరిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. అయితే గిరిజనులు తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆవాసాలను వదులుకోవడానికి సిద్ధపడడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.



ఇళ్ల నిర్మాణాలకు అంగీకరించిన గిరిజనులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

యువకుడు ఆత్మహత్య


నారాయణరావు

ఎచ్చెర్ల: లావేరు మండలం నాగంపాలెం గ్రామానికి చెందిన రైతు నారాయణ రావు (25) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 26న మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో క్షణికావేశంలో గడ్డి మందును తాగడంతో నారాయణరావును ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. లావేరు పోలీ

అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్

విశాఖ స్పోర్ట్స్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 720 మంది బాలురు, 510 మంది బాలికలు అథ్లెటిక్స్‌తో పాటు ఆరు క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, టీటీ, చదరంగంతో పాటు అథ్లెటిక్స్ ట్రాక్, ఫీల్డ్ అంశాల్లోనూ మూడు రోజుల పాటు జరిగే ఈపోటీలో 138 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌కు చెందిన విద్యార్థులు ప్రాంతీయ జట్లుగా తలపడనున్నారు. పురుషుల లాంగ్ జంప్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నుంచి కె.శివరామకృష్ణ ప్రథమ స్థానం, గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ నుంచి ఎన్.ఈశ్వరవర్ధన్ ద్వితీయ స్థానం, పాడేరు ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ నుంచి కె.ప్రశాంత్ కుమార్ తృతీయ స్థానంలో నిలిచినట్లు కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు.

దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా వారి సి.ఎస్.ఆర్. ఫండ్స్ సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ అర్హత గుర్తింపు కార్యక్రమం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. కేంద్రమంత్రితో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన పరికరాలను అర్హులను గుర్తించి అందజేస్తామన్నారు. త్వరలో పలాస, టెక్కలి డివిజన్లలోనూ ఎంపిక నిర్వహిస్తామని చెప్పారు. కలెక్టర్ దివ్యంగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ ఏడీ కవిత, జెడ్పీ సీఈఓ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి బీమాను సద్వినియోగం చేసుకోండి


రైతులతో మాట్లాడుతున్న ఏడీహెచ్ శైలజ

కవిటి: జిల్లాలో 35000 ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్న రైతులంతా ఈ ఏడాది ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న కొబ్బరి బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ (ఏడీహెచ్) ఎస్.శైలజ అన్నారు. మంగళవారం చండిపురం రైతు సేవా కేంద్రంలో వీఏఏ, వీఏహెచ్‌లతో సమావేశం అనంతరం ఆర్.భైరిపురంలో రైతులతో భేటీ అయ్యారు. మార్చి 31లోగా సచివాలయం వీఏఏ, వీఏహెచ్‌లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆర్అండ్ఆర్ పథకం రెండో విడత నిధులు జిల్లాకు చేరాయని, త్వరలో ఆర్.భైరిపురం రైతులకు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ పథకాన్ని కోరుకునే రైతులు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. కోకోనట్ ఏరియా ఎక్స్‌పాన్షన్ కార్యక్రమం ద్వారా ఖాళీ వ్యవసాయ క్షేత్రాలలో కొత్తగా మొక్కలు వేసి కొబ్బరి పంటను అభివృద్ధి చేసే కార్యక్రమం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత, ఎంపీఈఓ పూడి లలిత, సిబ్బంది బాలరాజు, గణపతి, ఏపీమైక్రో ఇరిగేషన్ ఎంఐఏఓ బొర్ర శరణ్య తదితరులు పాల్గొన్నారు.

2,3 తేదీల్లో రథసప్తమి క్రీడాపోటీలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లి సూర్యనారాయణస్వామి రథసప్తమి ఉత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 2, 3 తేదీల్లో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను విజయవంతం చేయాలని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయిలో వాలీబాల్ పోటీలు, జిల్లాస్థాయిలో వెయిట్‌లిఫ్టింగ్, గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వాలీబాల్ పోటీల విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులు, వెయిట్‌లిఫ్టింగ్ విజేతలకు రూ.20వేలు, గ్రామీణ క్రీడల్లో రూ.60వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్టు వివరించారు. డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పి.సుందరరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ జిల్లాలో పరిశ్రమల స్థాపనే లక్ష్యం


సీఈవోలతో సమావేశం నిర్వహిస్తున్న సీఎం మోహన్‌చరణ్

- సీఎం మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో పరిశ్రమల స్థాపనే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అన్నారు. ఉత్కర్ష్ ఒడిశా, మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్-2025 సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఒడిశాలో పెట్టుబడులు ఆహ్వానించేందుకు వివిధ కంపెనీల సీఈవోలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సెమీ కండక్టర్లు, ఐటీ, సిమెంట్ మొదలైన 100 పైబడిన ప్రముఖ కంపెనీల సీఈవోలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఒడిశాలో పెట్టుబడులకు పుష్కల అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఒడిశా జీడీపీ దేశంలోనే అత్యున్నత స్థాయిలో ఉందని పేర్కొన్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృష్టిలో ఒడిశా ఓ సంభావ్య రాష్ట్రమన్నారు. రాష్ట్రంలో రైల్వే, రోడ్లు, ఓడరేవుల రంగాలను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో సహజ వనరు సద్వినియోగంతో ఖనిజ రంగంలో అధిక పెట్టుబడులు లాభసాటిగా నిలిచి ఒడిశా అభివృద్ధి సాధించి భారతదేశం అభివృద్ధికి వారధిగా నిలుస్తుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మనోజ్ ఆహుజా, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, సీడబ్ల్యూసీ చైర్మన్ సంజీవ్ క్రిషన్, ముఖ్యమంత్రి అదనపు ప్రధాన కార్యదర్శి నికుంజా బిహారీ ధాలా, పరిశ్రమల శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి హేమంత్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

ధాన్యం అమ్మేందుకు సమయమివ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జయపురం: మండీల్లో ధాన్యం అమ్మేందుకు మరి కొంత గడువు కేటాయించాలని కుములిపుట్ రైతులు కోరారు. ఈ మేరకు జయపురం తహసీల్దార్ సవ్యసాచి జెనకు వినతిపత్రం మంగళవారం అందజేశారు. కుమిలిపుట్ ల్యాంప్‌లో 22వ తేదీన మండీల ప్రారంభించారని, అందువలన ధాన్యం అమ్మకం సమస్యగా మారిందన్నారు. తహసీల్దార్‌ను కలిసిన రైతులు చంద్రమోహన్ గౌఢ, భగవాన్ గదబ, రశ్మితనాయిక్, బలరాం మఝి, భగవాన్ భూమియ, మహేశ్వర హరిజన్, సునీల్ కుమార్ మిర్ధ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గుణుపూర్‌లో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అన్ని వీధుల గుండా సాగింది. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు.

రైతును ఆదుకోవాలి


ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి గారబంద పంచాయతీ కోయకొండ గ్రామానికి చెందిన రైతు రామలింగేశ్వర్‌రావు కల్లంలోని 45 ధాన్యం బస్తాలు ఇటీవల అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో సదరు రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, సర్పంచ్ పి.అశోక్ కుమార్‌లు రైతును మంగళవారం పరామర్శించారు. పంటనష్టంపై సీఎంకు వినతిపత్రం ఇవ్వాలని సలహా ఇచ్చారు. దీనిపై వచ్చే అసెంబ్లీలో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


వర్సిటీ క్యాంపస్‌లో స్వామివారి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీవిద్యా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు దంపతులు అష్టోత్తర శత కలశ స్నపన తిరుమంజనము, అనంత హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పండితుల సత్కారంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ప్రధాన పూజారి ఆరవెల్లి శేఖరాచార్యులు తెలియజేశారు.

రాయగడలో డీఆర్‌ఎంల పర్యటన


రాయగడ రైల్వేస్టేషన్ పరిశీలిస్తున్న డీఆర్‌ఎంలు

రాయగడ: విశాఖపట్నం రైల్వే డివిజన్ మేనేజర్ మనోజ్ కుమార్ సాహు, రాయగడ రైల్వే డివిజన్ మేనేజర్ అమితాబ్ సింఘాల్‌లు రాయగడలో మంగళవారం పర్యటించారు. రాయగడ-విజయనగరం సెక్షన్‌లో సమగ్ర తనిఖీలను నిర్వహించారు. ఈ మార్గంలో ప్రయాణికుల సౌకర్యాలపై ఆరా తీశారు. రాయగడలో రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి, వాహన పార్కింగ్ స్థలం, రిలే రూమ్‌ల పనితీరును పరిశీలించారు. రాయగడ రైల్వేస్టేషన్ భవనం అభివృద్ధి పనులు సమీక్షించారు. అందుకు సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాయగడకు సమీపంలోని లడ్డ-జిమిడిపేట లెవెల్ క్రాసింగ్ గేట్ భద్రత గురించి పరిశీలించారు. ప్రయాణికుల మౌలిక సౌకర్యాలను దృష్టిలో పెట్టుకున్న డిఆర్ఎంలు రాయగడ నుంచి విజయనగరం వరకు విండో ట్రెలింగ్ తనిఖీని చేపట్టారు. పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులు, అభివృద్ధి పనులను సమీక్షించారు.

54 అవగాహన ఒప్పందాలు

భువనేశ్వర్: ఉత్కర్ష్ ఒడిశా, మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్-2025 పురస్కరించుకొని ఇప్పటికే 54 అవగాహన ఒప్పందాలు కుదిరినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రముఖ కార్యదర్శి హేమంత్ శర్మ తెలిపారు. సిమెంట్, విద్యుత్, అల్యూమినా, స్మెల్టర్, ఇండస్ట్రియల్ పార్కుల్లో అదానీ గ్రూప్ రూ.2.28 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొన్నారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ రాష్ట్రంలో రూ.35 వేల కోట్ల పెట్టుబడితో కెంజొహర్ జిల్లాలో 5 ఎంపీటీఏ సామర్థ్యంతో ఉక్కు కార్ఖానా ఏర్పాటు చేయడానికి ఎంవోయూ సంతకం చేసిందన్నారు. జేఎస్‌పీఎల్ సంస్థ రాష్ట్రంలో రూ.70,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి కనబరిచిందన్నారు.

సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ప్రారంభం



జయపురం: సమితిలోని పూల్‌బెడ - ఉమ్మిరి మధ్య నిర్మించిన సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా కేంద్రాన్ని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, సీఎం మోహన్‌చరణ్ మాఝి, రాష్ట్ర ఐటీ విభాగ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్‌లు భువనేశ్వర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఒడిశా నుంచి ఉద్యోగ, ఐటీ ఎగుమతులను ప్రోత్సహించేందుకు కొరాపుట్ జిల్లా జయపురంలో స్థాపించడం జరిగిందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ వి.కీర్తి వాసన్, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి, జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

- స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి
- ఎంపీ సప్తగిరి ఉలక

రాయగడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ డవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశ) సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎంపీ సప్తగిరి జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. ఆయా పథకాల పనులు ఎంత వరకు ముందుకు సాగాయన్న వివరాలను ఆరా తీశారు. జిల్లాలోని పద్మపూర్ సమితిలో ధాన్యం మండీల్లో నెలకొన్న సౌకర్యాల కొరత, సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వంటి కారణాల వల్ల రైతులు ఆందోళన చేసిన విషయమై సంబంధిత శాఖ అధికారులను ప్రశ్నించారు. 2022 నుంచి రైతులకు బకాయిలు ఉన్నా ఇంతవరకు ఎందుకు చెల్లించలేదని మండిపడ్డారు. రైతుల బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్థానికులకు అవకాశం కరువు

కొద్దిరోజుల క్రితం టాటా పవర్ కార్పొరేషన్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలకు 800 మంది హాజరవ్వగా, వీరిలో 100 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినప్పటికీ స్థానికులు అందులో లేకపోవడం విచారకరమన్నారు. స్థానికులకు అవకాశాలు ఇవ్వకపోవడం వెనుక ఎవరి స్వార్థం ఉందని ప్రశ్నించారు. అదే తరహా బృహత్తర పరిశ్రమల్లో కూడా స్థానిక యువతకు అవకాశాలు కల్పించడంలో మొండిచెయ్యి మాత్రమే ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఈ ధోరణి మారాలని సూచించారు. అర్హత కలిగిన యువతకు ఇకపై అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

రైల్వేలైన్ నిర్మాణంపై చర్చ

గుణుపూర్-తెరువలి రైల్వేలైన్ నిర్మాణ పనులపై చర్చించిన ఎంపీ సప్తగిరి, ఆదివాసీలు నివసిస్తున్న సుమారు 60 గ్రామాలకు చెందిన 269.521 హెక్టార్ల స్థలం, అలాగే ప్రభుత్వానికి చెందిన 1333.437 హెక్టార్లు, అదేవిధంగా మరో 70.828 హెక్టార్ల అటవీ స్థలం అవసరముంటుందని సంబంధిత రైల్వే శాఖ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గుణుపూర్-తెరువలి రైలు మార్గం నిర్మాణంలో భాగంగా అత్యధికంగా అటవీ, కొండ ప్రాంతాల్లోని ఆదివాసీలు భూములు కోల్పోయే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఈ మార్గం నిర్మాణంలో గుణుపూర్, పద్మపూర్ గుడారి మీదుగా బిసంకటక్ వరకు అనుసంధానిస్తే భూములు కోల్పోయే అవకాశం తక్కువగా ఉండడంతో పాటు ఎంతో మందికి రైలు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో, కలెక్టర్ ఫరూల్ పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యం


నవీన్ పట్నాయక్ అధ్యక్షతన బీజేడీ పార్లమెంట్ సభ్యుల సమావేశం

- మాజీ సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: బీజేడీ పార్టీకి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. పార్లమెంట్ బడ్జెటు సమావేశాలు పురస్కరించుకుని బిజూ జనతా దళ్ పార్లమెంట్ సభ్యులు ఆ పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ అధ్యక్షతన మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంతో పార్లమెంటులో గళం వినిపించాలని పార్టీ ఎంపీలకు ప్రబోధించారు. 4.5 కోట్ల రాష్ట్ర ప్రజల హక్కులు, గౌరవం కోసం పోరాడాలని తెలిపారు. నీతి ఆయోగ్ వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరం జాతీయ స్థాయిలో ఆర్థిక నిర్వహణలో ఒడిశా అగ్రగామిగా నిలిచింది. దీనికి నవీన్ నిరంతర వ్యూహాత్మక కార్యాచరణే కారణమని ఎంపీలు పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంటులో 15 ప్రధాన అంశాలు ప్రస్తావించాలని తెలిపారు. ఒడిశాకు ప్రత్యేక రాష్ట్రం హోదా, ద్రవ్యోల్బణం మరియు ధరల పెరుగుదల నియంత్రణ, నిరుద్యోగ సమస్య, రైతుల కష్టాలు, వ్యవసాయ ఇక్కట్లు, పోలవరం, మహానది జలాల పంపిణీ వివాదాలు, బొగ్గు రాయల్టీ, హరిత పన్ను తదితర సమస్యలపై ప్రశ్నించాలని సూచించారు.

ఉత్తరాంధ్రలోనే గంజాయి మూలాలు

- చిన్నారులు, వృద్ధులపై లైంగికదాడులు సిగ్గుచేటు
- విలేకరులతో డీజీపీ ద్వారకా తిరుమలరావు


మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్రంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా మూలాలన్నీ ఉత్తరాంధ్ర నుంచే ఉంటున్నాయని, ఈ నేపథ్యంలో ఈగల్ అనే సంస్థను ఏర్పాటు చేసి ఎలిట్ యాంటీ నార్కోటిక్ ఫోర్స్ ద్వారా గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. గంజాయి సాగు, క్రయ విక్రయాలు, అక్రమ రవాణా అరికట్టేలా చెక్ పోస్టులు పెంచామని, యువకులు, విద్యార్థులను సంకల్పం ద్వారా మాదకద్రవ్యాలు వాడొద్దని అవగాహన పరుస్తున్నామని చెప్పారు. మంగళవారం డీజీపీ హోదాలో తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన ద్వారకా తిరుమలరావుకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పోలీసులు గౌరవవందనం సమర్పించారు. డీఐజీ గోపినాథ్ జెట్టీ, ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఇతర జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడారు. బాలికలు, మహిళలనే కాకుండా 70 ఏళ్ల వృద్ధురాళ్లపైనా లైంగికదాడులు జరగడం సమాజం సిగ్గుపడాల్సిన విషయమని డీజీపీ చెప్పారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతీ జిల్లాకు డీఎస్పీని ఎస్‌హెచ్‌ఓగా టెక్నికల్ టీమ్‌ను పెట్టి సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే వైజాగ్, విజయవాడలో ఇవి ఉన్నాయని చెప్పారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు, తక్షణమే శిక్షలు పడేలా స్పెషల్ కోర్టులు హైకోర్టు ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రభుత్వం అన్ని ఖర్చులు భరించడం కష్టం కాబట్టి దాతలు, ప్రజలు సహకరించాలని, మార్చి 31 నాటికి లక్ష పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో పనిచేయని 460 కెమెరాలు బాగుచేశామని, ఇవికాక మరో 520 కొత్తవి ఉన్నాయని చెప్పారు.

రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న హత్యాకాండపై..

ఎన్నికల అనంతరం పార్టీలకతీతంగా జరుగుతున్న హత్యాకాండలపై డీజీపీ మాట్లాడుతూ హత్యలనేవి తగ్గాయని, ఓవరాల్‌గా క్రైమ్ రేట్ తగ్గిందని, జీరో క్రైమ్ దిశగా ముఖ్యమంత్రి పనిచేయమన్నారని డీజీపీ స్పష్టం చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో చూడకుండా పారదర్శకంగానే పనిచేస్తున్నామని, తప్పు చేసినవారిపై కేసులు కడుతున్నామని చెప్పారు. పక్క రాష్ట్రంలో అలజడులు చేస్తూ ఏపీలో మావోయిస్టులు దాక్కుంటే చూస్తూ ఊరుకోమని, ఆపరేషన్లలో కీలక వ్యక్తులైన 30 మందిలో 13 మంది పార్టీలను వదిలేశాయని, మిగతా వారికోసం గాలిస్తున్నామని, తదనుగుణంగా ఇటీవల ఆపరేషన్లు పెంచామన్నారు. జిల్లాలో పేకాట డెన్‌లు, ఇసుక అక్రమ రవాణా పైడి భీమవరం చెక్‌పోస్టులో అడ్డుకోవడం లేదన్న ప్రశ్నపై దృష్టిసారిస్తామన్నారు. రాష్ట్ర విభజన చట్టం అనుసరించి పోలీసుల పదోన్నతులకు ఆటంకం కలుగుతుందన్న ప్రశ్నకు బదులిస్తూ డీఎస్పీలకు, సీఐలకు రెండు మూడు రోజుల్లో ప్రమోషన్ ఉంటుందన్నారు. జిల్లాలో రెండున్నరేళ్లుగా ఉన్న టెంపుల్ కేసులను ఛేదించిన పోలీసులకు అభినందించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం చక్కగా పనిచేస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పకడ్బందీగా రథసప్తమి ఏర్పాట్లు

- అధికారులకు మంత్రి అచ్చెన్న ఆదేశం


పనులు పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం/అరసవల్లి: జిల్లాలో మూడు రోజుల పాటు రాష్ట్ర పండగా రథసప్తమికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రథసప్తమి సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలిసి మంగళవారం అధికారులతో సమీక్షించారు. క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఏర్పాట్లపై సూచనలు చేశారు. నగర అభివృద్ధి, సుందరీకరణ పనులపై నగర కమిషనర్ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. సింహద్వారం నుంచి డే అండ్ నైట్ జంక్షన్, ఏడు రోడ్ల జంక్షన్, పాత బస్టాండ్ నుంచి మిల్లు జంక్షన్ వరకు జరుగుతున్న పనులను పరిశీలించారు. రాత్రీ పగలు పనిచేసి రథసప్తమి నాటికి పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తారని, అందుకు సరిపడా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మున్సిపల్ ఇంజనీర్ దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

వారికి ఆలయ స్థలాలు కేటాయింపు

అనంతరం ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలాల యజమానులతో మంత్రి మాట్లాడారు. కోరుకున్న చోట స్థలాన్ని కేటాయిస్తామని మరోసారి మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' స్కీం అరసవల్లి క్షేత్రానికి అమలయ్యేలా కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఫెస్టివల్ ఆఫీసర్ కె.సుబ్బారావు, ఆర్డీవో సాయిప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, ఈఓ భద్రాజీ, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ పి.సుగుణాకరరావు, విద్యుత్ శాఖ ఈఈ యోగేశ్వరరావు, టీడీపీ ఇన్‌చార్జిలు ఉంగటి రమణమూర్తి, తెలుగు నాగరత్నం, ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

దర్శన టిక్కెట్లపై సమీక్ష:

ఆలయంలో వచ్చే నెల 4న జరగనున్న రథసప్తమి ఉత్సవానికి వివిధ దర్శన టికెట్లు, దాతల పాసులపై మంత్రి సమీక్షించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు వీఐపీ పాసులను ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. దాత పేరిట ఒక పాసు మాత్రమే ఇస్తే మంచిదని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేయగా..ఆలయ అభివృద్ధికి అసలు కారణం దాతలే అని...పలు దఫాలుగా రూ.లక్షకు మించి విరాళాలు ఇచ్చిన దాతలకు ఒకే పాసు ఇచ్చే నిర్ణయంపై పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కె.సుబ్బారావు, అసిస్టెంట్ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్లు కె.శోభారాణి, కెఎన్‌డివి ప్రసాద్, దేవదాయ శాఖ ఈఈ రమణ, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులున్నారు.

వేడుకలకు పటిష్ట భద్రత



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో జరగనున్న అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలు సందర్భంగా పటిష్ట భద్రతతో కూడిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, శాంతియుతంగా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మూడురోజులు నిర్విరామంగా జరిగే ఉత్సవాలు నిరంతరం సీసీ టీవీ, డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలన్నారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులను సంప్రదించి వాహనాల పార్కింగ్, లైటింగ్ వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. పెద్ద వాహనాలు రాకుండా ట్రాఫిక్ మళ్లింపుచేయాలన్నారు. దేవదాయ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో దర్శనాలు క్యూలైన్లలో సజావుగా చేయించాలన్నారు. ముఖ్య కూడళ్లలో బారికేడ్లు ఏర్పాటు చేసి దర్శన టికెట్ కౌంటర్లు, ప్రసాదం విక్రయ కేంద్రాలు, పార్కింగ్ ప్రాంతాలు ప్రజలకు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, అప్పారావు, ప్రసాదరావు, శేషాద్రి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారి పూర్వ అర్చకుడు రవి మృతి



దేవులపల్లి రవి ప్రసాద్ శర్మ (ఫైల్)

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయంలో అర్చకుడిగా పనిచేసి పదవీవిరమణ చేసిన పూర్వ అర్చకుడు దేవులపల్లి రవిప్రసాద్ శర్మ మంగళవారం మృతిచెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. రైల్వేస్టేషన్ వద్దనున్న వనం గుడిలో ప్రధాన అర్చకుడిగా పనిచేయడంతో పాటు ఆలయ అభివృద్ధికి ఆయన విశేషంగా సేవలందించారు. కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శివాలయం అర్చకుడిగా ఆయన సుపరిచితుడు. ఆయన మృతిపట్ల దేవాదాయశాఖ అధికారులు, పలువురు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆధ్యాత్మిక గురువు మృతి



కిమిడి సత్యనారాయణ నాయుడు (ఫైల్)

రేగిడి: మండలంలో రేగిడి గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణ నాయుడు(80) గుండెపోటుకు గురై విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పారిశ్రామికవేత్తగా విశేష సేవలు అందించడంతో పాటు రేగిడి మండలంలో జ్యూట్, కేబుల్ పరిశ్రమలు రేగిడిలో నెలకొల్పి ఎన్నో కుటుంబాలకు ఉపాధి కల్పించారు. రేగిడి గ్రామంలో రూ.1 కోటితో మైసూర్ దత్తపీఠం నిర్మించి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆయనకు భార్య సత్యవతమ్మతో పాటు కుమారులు సూరప్పనాయుడు, రవిశంకర్‌లు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావునాయుడుకు స్వయాన సోదరుడు. సోదరుడి మృతివార్తను తెలుసుకున్న సోదరులు, మాజీ మంత్రి కిమిడి మృణాళిని, విజయనగరం జిల్లా పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, రేగిడి మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణనాయుడు తదితరులు రేగిడి చేరుకుని, సత్యనారాయణ నాయుడు మృతదేహం వద్ద నివాళులర్పించారు. రేగిడి గ్రామంలో సత్యనారాయణనాయుడు అంత్యక్రియలు బుధవారం జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

బొండపల్లి: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా రూ.2 వేలు విధిస్తూ విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి మంగళవారం సాయంత్రం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021వ సంవత్సరంలో బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో బొండపల్లి గ్రామానికి చెందిన గొండేల చంద్రయ్య అలియాస్ శ్రీనివాస్‌పై పోక్సో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. బాలిక ఆడుకుంటుండగా చంద్రయ్య బలవంతంగా మామిడి తోటలోకి తీసుకెళ్లి లైంగికదాడికి ప్రయత్నించగా బాలిక కేకలు వేయడంతో గ్రామస్తులు రావడంతో నిందితుడు చంద్రయ్య పరారయ్యాడు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై వాసుదేవరావు, బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు దర్యాప్తు నిర్వహించి అభియోగ పత్రాలు దాఖలు చేశారు. నేరారోపణ రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా శిక్ష ఖరారు చేసినట్లు ఎస్పీ వివరించారు.

ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ పనులపై విజిలెన్స్ తనిఖీలు




పనుల నాణ్యతను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు

సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినిరింగ్ శాఖ ద్వారా నిర్మించిన పలు రహదారులపై మంగళవారం విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు తనిఖీ చేశారు. ఈ మేరకు కగడంగి పంచాయతీ పరిధిలోని నారాయణగూడ పరిధిలో గతంలో నిర్మించిన రహదారి పనుల నాణ్యతా ప్రమాణాలు చూశారు. నివేదికలు ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ సత్యనారాయణ, ఈఈ రమాదేవి పాల్గొన్నారు.

తిరుచనాపల్లిలో జిల్లా గైడ్స్ ప్రదర్శన

విజయనగరం అర్బన్: తమిళనాడులోని తిరుచనాపల్లిలో మంగళవారం జరిగిన జాతీయ జంబోరీ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థుల ప్రదర్శనకు ప్రశంసలు లభించాయి. వచ్చే నెల 3వ తేదీ వరకు తిరుచనాపల్లిలో జరుగుతున్న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరీ ప్రదర్శనలో జిల్లాకు చెందిన 49 మంది విద్యార్థులు పాల్గొంటారని జిల్లా కార్యదర్శి వాక చిన్నంనాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రతినిధులుగా జిల్లా నుంచి 49 మంది సభ్యులతో జిల్లా కమిషనర్ బీపీరాజు, వైస్ ప్రెసిడెంట్ చోడవరపు నారాయణ మూర్తి, ఏఎస్‌ఓసీ దుర్గా నాగేశ్వరరావు, గైడ్ కెప్టెన్ నయామున్నిసా, రెల్లివలస, కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల స్కౌట్స్ 30 మంది, గైడ్స్ 19 మంది పాల్గొంటారని చెప్పారు.



దారులన్నీ జన సంద్రమే.. ఎటువైపు చూసినా కనుచూపు మేర 'శంబర'మే. దిక్కులు పిక్కటిల్లేలా అమ్మ శరణు ఘోష ఓ వైపు.. సాక్షీభూతంగా నిలిచిన గోముఖీ నది సవ్వడులు మరోవైపు లయబద్ధంగా సాగుతుంటే.. చల్లని తల్లి, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం.. గిరిజనుల కొంగు బంగారం పోలమాంబ 36 అడుగుల సిరిమానుపై టీవీగా ఆసీనులై, పురవీధుల్లో ఊరేగింది. తన చల్లని చూపుతో భక్తులకు ఆశీర్వచనాలు అందజేసింది. ఈ అపురూప ఘట్టాన్ని కనులారా తిలకించిన భక్తకోటి మురిసిపోయింది. ఆనందంతో పులకించిపోయింది.

పోలమాంబ పాహిమాం

- భక్తజన 'శంబర'ం
- కనుల పండువగా పోలమాంబ సిరిమానోత్సవం
- తరలివచ్చిన లక్షలాదిమంది భక్తులు
- భక్తుల జయజయధ్వానాల నడుమ పురవీధుల్లో ఊరేగిన వనదేవత



శంబర పోలమాంబ సిరిమానోత్సవం

సాక్షి, పార్వతీపురం మన్యం/మక్కువ/సాలూరు:

గిరిజనుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం కనులపండువగా సాగింది. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబరలో కొలువైన పోలమాంబ జాతరకు ఉమ్మడి విజయనగరం జిల్లాతోపాటు, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సోమ, మంగళవారాల్లో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పసుపుకుంకుమలు, చీరలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. ఈ సంబరంలో కీలక ఘట్టమైన సిరిమానోత్సవం మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైంది. పూజారి జన్నిపేకాపు రామారావు మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ సిరిమానును అధిరోహించారు. తొలుత గిరడ వారి ఇంటి వద్ద పూజలు అందుకున్న అనంతరం.. సావిడి వీధిలోని మునసబు ఇంటి వద్ద పసుపు కుంకుమలు అందుకుని సిరిమాను ముందుకు సాగింది. ప్రధాన రహదారి మీదుగా ఎస్సీ కాలనీ, పనుకు వీధి, గొల్లవీధి నుంచి తిరిగి సావిడివీధికి చేరుకుంది. అనంతరం అమ్మవారి ఘటాలను గద్దె వద్ద ఉంచడంతో సిరిమాను ఘట్టం ముగిసింది.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి



పోలమాంబకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి

పోలమాంబ పండగను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అంపకోత్సవం రోజున గ్రామంలోకి పోలమాంబ

శంబర పోలమాంబ జాతరలో సోమవారం తొలేళ్లు, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అంపకోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఫిబ్రవరి 4న మారు జాతర నిర్వహిస్తారు. తర్వాత ఎనిమిది వారాల పాటు జాతర కొనసాగుతుంది. అప్పటి వరకూ ప్రతి మంగళవారం భక్తులు తల్లి దర్శనానికి వస్తూ ఉంటారు.

పటిష్ట బందోబస్తు

సిరిమాను సంబరాన్ని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి, అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా 700 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పోలమాంబను దర్శించుకున్న ఎస్పీ బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. సిరిమాను ఆద్యంతం అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురాన, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి సిరిమాను వెంబడి ఉండి బందోబస్తును స్వయంగా పర్యవేక్షించారు. పోలీస్ సేవాదళ్ సభ్యులు దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులకు ఇబ్బందులు కలగకుండా సేవలందించారు. అందరి సహకారంతో అమ్మవారి సిరిమానోత్సవం ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖ చేపట్టిన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలు సత్ఫలితాలిచ్చాయన్నారు.

కిక్కిరిసిన క్యూలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పోలమాంబ అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. 10 గంటల సమయానికి క్యూలు నిండిపోయాయి. నీడ కోసం ఏర్పాటు చేసిన పెండాల్స్ చాలక.. ఎండలోనే భక్తులు అవస్థలు పడ్డారు. గంటలకొద్దీ లైన్లలో నిల్చోవాల్సి వచ్చింది. గోముఖి నదిలో స్నానాలు చేసి, అమ్మవారిని దర్శించుకుని కోళ్లు, పోతులు, చీర, పసుపుకుంకుమ సమర్పించి అమ్మవారికి ప్రణమిల్లారు. ప్రధాన గుడిలోపలికి వెళ్లలేకపోయిన భక్తులు.. వనం గుడి వద్దకు వెళ్లి, పెద పోలమాంబను దర్శించుకుని, వేప చెట్టుకు పూజలు చేసి, అక్కడ నుంచే మొక్కులు చెల్లించుకుని వెనుదిరిగారు. దేవస్థానం అధికారులు ఉచిత దర్శనంతో పాటు, రూ.20, రూ.100 టికెట్లతో ప్రత్యేక దర్శనం కల్పించారు.



అమ్మవారి ఘటాలు

లక్షల్లో తరలి వచ్చిన భక్తులు

ఏటా జనవరి చివరివారంలో జరిగే పోలమాంబ జాతర వేడుకకు లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ ఏడాది కూడా దాదాపు 3 లక్షల మందికిపైగా తరలివచ్చారని అంచనా. పోలమాంబ శంబర గ్రామంలో పుట్టి పెరిగినందున గ్రామస్తులంతా పోలమాంబను తమ ఇంటి ఆడపిల్లగా భావిస్తారు. సంక్రాంతి పండగకు ప్రతి ఆడపిల్ల పుట్టింటికి వెళ్లే ఆనవాయితీ ఉంటుంది. అందువల్లే పోలమాంబ అమ్మవారిని సంక్రాంతి రోజుకు ముందు వచ్చే మంగళవారం గ్రామంలోకి తీసుకువస్తారు. పండగ తరువాత వచ్చే మంగళవారం అమ్మవారికి పూజలు నిర్వహించి, ఆ తరువాత వచ్చే మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించడం కొనసాగింపుగా వస్తోంది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్రతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. ఈ ఏడాది కూడా అమ్మ జాతర భక్త జన సంద్రంగా మారింది. ఆర్టీసీ 130 ప్రత్యేక బస్సులను నడిపింది. రాకపోకలకు భక్తులు ఇబ్బందులు పడకుండా సేవలందించింది.

స్వల్ప ఘటనలు



సిరిమాను సంబరానికి ముందు తల్లి సేవకు రాలిపై పిట్టగోడ కూలింది. దీంతో స్వల్ప గాయాలపాలైన ఆమెను ఫీడర్ అంబులెన్స్‌లో తరలించి చికిత్స అందించారు. మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడుకు భక్తులు విసిరిన కొబ్బరి చిప్ప తగలడంతో స్వల్ప గాయమైంది.

- సిరిమానోత్సవం సమయంలో పారిశుద్ధ్య చర్యలు అంతంత మాత్రం గానే కానవచ్చాయి. రథం తిరుగుతున్న సమయంలో భక్తులు అరటిపండ్లు విసరడం ఆనవాయితీ. గతంలో వెనువెంటనే వీటిని శుభ్రపరిచేవారు. ఈసారి సకాలంలో స్పందించకపోవడంతో, అరటి పండ్ల మీద కాలు వేసి, చాలా మంది భక్తులు జారిపడ్డారు.
- జాతరలో పెద్ద ఎత్తున తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. ఈ క్రమంలో తమ నుంచి కొంత మంది ఆశీల రూపంలో దౌర్జన్యంగా నగదు వసూలు చేశారని పలువురు వ్యాపారులు వాపోయారు.
- **ముగిసిన ఉత్సవం:** సిరిమాను ఉత్సవం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైంది. తిరిగి సాయంత్రం 5.10 నిమిషాల సమయంలో గద్దె వద్దకు ఘటాలు చేరుకోవడంతో సంబరం ముగిసినట్లయింది.
- స్వల్పమైనవి మినహా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన పీఓ

పోలమాంబ జాతరకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ లేకుండా చూడాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలమాంబ సిరిమాను పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. మంగళ, బుధవారాల్లో అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో రద్దీ దృష్ట్యా రానుపోను రవాణా, భక్తుల దర్శనార్థం క్యూలు ఏర్పాటుచేయాలన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్నానపు గదులు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు ఏర్పాట్లను పరిశీలించిన ఆయన.. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ తలెత్తకుండా పటిష్ట బందోబస్తు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

రాళ్లు తేలిన సిరిమాను మార్గం..



సిరిమాను తిరిగే మార్గంలో హడావిడిగా రహదారి పనులు చేపట్టారు. జాతరకు మూడు రోజులు ముందే పనులు ప్రారంభించడం.. అవి కూడా ఉమ్మతడిగా మమ అనిపించడంతో మొత్తం రాళ్లు తేలి నడిచేందుకు కూడా భక్తులు ఇబ్బందులు పడ్డారు. సిరిమాను తిరిగే పనుకువీధి మార్గంలో పెద్ద పెద్ద రాళ్లు బయటకు వచ్చాయి. దీంతో రథం తిరగడానికి కాస్త ఆటంకం కలిగింది.





శంబర పొలిమేరలోనే భక్తుల వంటావార్పు





సిరిమానోత్సవంలో వేషధారణల సందడి



తల్లి దర్శనం కోసం...

ఐకాన్ అవార్డుకు ఎంపికైన గౌరీశ్వరి



చంద్రమతి పాత్రలో అక్కివరపు గౌరీశ్వరి

రాజాం: రాజాం పట్టణానికి చెందిన రంగస్థల కళాకారిణి అక్కివరపు గౌరీశ్వరి తెలుగు వెలుగు సాహితీ వేదిక ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రాచీన శివభాగవతం, సారంగధర వంటి భూ భాగవత కళారంగంతో పాటు పౌరాణిక నాటకాల్లో పలు పాత్రల్లో విశేష నటను కనబర్చిన గౌరీశ్వరి గత 15 ఏళ్లుగా నాటకరంగంలో జీవిస్తున్నారు. శివభాగవతంలో పార్వతీదేవి పాత్ర, సారంగధరలో చిత్రాంగిదేవి పాత్రలో ఆమె నటన రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖ్యాతిగడించింది. పౌరాణిక నాటకాల్లో చంద్రమతి పాత్ర పోషిస్తూ కీర్తి గడించారు. పేరొందిన జాతీయ కళాకారుల సరసన పద్యనాటకాల్లో పాత్రలు పోషించి ఔరా అనిపించారు. కోవిడ్ కష్టకాలంలో పాత్రలు లేక ఇబ్బందులు పడ్డ చాలామంది కళాకారులకు ఆల్ ఇండియా కళారంగం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తన సేవలు, సాయం అందింది, అండగా నిలిచారు. ఆమె సేవలతో పాటు నటనను గుర్తించిన తెలుగుసాహితీ వేదిక స్వామి వివేకానంద జయంతి మహోత్సవాల సందర్భంగా ఐకాన్ అవార్డును ప్రకటించింది. ఫిబ్రవరి 2న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డును నిర్వాహకులు ఆమెకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా గౌరీని పలువురు కళాకారులు, రాజాం పట్టణ ప్రజలు అభినందించారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు ఇద్దరు ఎంపిక

సంతకవిటి: మండలానికి చెందిన ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కె.సూర్యనారాయణ డిసెంబర్ 6 నుంచి 9 వరకు గుంటూరులో జరిగిన సివిల్ సర్వీసెస్ క్రీడల్లో లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి, ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు చండీగఢ్‌లో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడలకు రాష్ట్రం తరఫున ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం సంతకవిటి మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అలాగే మండలంలోని తుమరాం గ్రామానికి చెందిన డి.యశోద గుంటూరులో జరిగిన సివిల్ సర్వీసెస్ క్రీడల్లో 200 మీటర్ల రన్నింగ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయిలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడల్లో 100, 200 మీటర్ల రన్నింగ్ విభాగంలో రాష్ట్రం తరఫున ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేట మండలం కరకవలసలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వారి ఎంపిక పట్ల పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మిమ్స్ విద్యార్థినికి రజత పతకం



వందనను అభినందిస్తున్న మిమ్స్ యాజమాన్యం

నెల్లిమర్ల: జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో మిమ్స్ కళాశాలలో ఫిజియోథెరపీ విద్యార్థిని సత్తాచాటింది. ఈనెల 19 నుంచి 22 వరకూ ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో వందన పాల్గొని రజత పతకం సాధించింది. పవర్ లిఫ్టింగ్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన ఆర్.వందనను ఆమె తల్లిదండ్రులు లక్ష్మీగాయత్రి, శంకరరావు, కోచ్ మహేష్‌లను మిమ్స్ చైర్మన్ అల్లూరు సత్యనారాయణ, మిమ్స్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్ వర్మ, డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్ మంగళవారం అభినందించారు. వందన అంతర్జాతీయ పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. వందనను అభినందించిన వారిలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రఘురాం, అకడమిక్ డైరెక్టర్ వేణుగోపాల్ రావు, ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, వ్యాయామ అధ్యాపకులు కళావెంకట రావు, ఏఓ గణేష్ ఉన్నారు.

అమృత్ భారత్ పనులు పరిశీలించిన డీఆర్ఎం



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న వాల్తేర్ డీఆర్ఎం మనోజ్ కుమార్ సాహు, రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింగల్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ నూతన స్టేషన్ నిర్మాణ పనులను వాల్తేర్ డీఆర్ఎం మనోజ్ కుమార్ సాహు, రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింగల్‌లు మంగళవారం పరిశీలించారు. ప్రయాణికులకు కొద్ది రోజుల్లోనే అధునాతన రైల్వేస్టేషన్ అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు. అమృత్ భారత్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నూతనంగా ఎఫ్‌ఓబీ, టికెట్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, వెయింటిగ్ హాల్ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.సాందీప్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ రిటర్న్ ఫైల్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ఆదాయపు పన్ను శాఖకు సంబంధించిన రిటర్న్ ఫైల్‌కోసం గతంలో కార్యాలయాలకు రావాల్సి ఉండేదని, ప్రస్తుతం ఇబ్బంది కలిగించకుండా వ్యాపారుల వద్దకే వచ్చి అవగాహన కలిగించే సర్వీసులు అందిస్తున్నామని ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో వ్యాపారులకు 'డైరెక్ట్ ట్యాక్సెస్ విత్ వివాద్ సే విశ్వాస్ స్కీమ్ (డీటీవీఎస్‌వీ)-2024' అనే అంశంపై మంగళవారం అవగాహన కల్పించారు. డీటీవీఎస్‌వీ స్కీమ్ మంచిదని, దానిని అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం ఐటీఓ వార్డ్-1 విశాఖ అనిరుధ్ ఆత్రేయ ఈ స్కీంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. చాంబర్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ రేంజ్ 1, 2 అధికారులు ఎస్.గోపీకృష్ణ, పి.వి.శేషగిరిరావు, చాంబర్ సహకార్యదర్శి పచ్చిగుళ్ల రామారావు, చాంబర్ పూర్వ అధ్యక్షుడు ఎం.వి.చలం, పి.ఎస్.సి.నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.